శనార్తి
తెలంగాణ
telanganarajyadhikaraparty.in
సంపుటి : 06 | సంచిక : 13 (కాంప్లిమెంటరీ కాపీ) | ఎడిటర్ : తీన్మార్ మల్లన్న | శనివారం 12-09-2026 | పేజీలు : 3



# అసెంబ్లీ సాధించిందేంది..?

## శాసనసభ సాక్షిగా పంతాల రచ్చ

- తెలంగాణ ప్రజలకు ఒరిగింది శూన్యం
- ప్రజాస్వామ్య వేదికపై రాజకీయ నాటకం
- నీళ్లపాలైన ప్రజాధనం.. మిగిలింది శూన్యమే..
- చర్చల్లేవు.. పరిష్కారాల్లేవు..
- ప్రజా సమస్యలు గాలికి.. రాజకీయం పీక్స్‌కి..
- సభ ముగిసింది.. సమస్యలు మిగిలాయి
- రూ.కోట్లు ఖర్చు.. ఫలితం శూన్యం
- నిరుద్యోగులు, రైతులకు మళ్లీ ఆశాభంగమే..
- ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరే
- ప్రశ్నోత్తరాల సమయం బలి
- అధికార, ప్రతిపక్షాల విమర్శల దండకంతోనే సరి
- సభలో పరస్పర దూషణలు.. సభ బయట డ్రామాలు
- పార్టీల మైండ్ గేమ్‌లకే ప్రాధాన్యం
- పట్టించుకోని రైతాంగం, నిరుద్యోగ సమస్యలు

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్ :** ప్రజాస్వామ్య దేవాలయంగా, కోట్లాది మంది తెలంగాణ ప్రజల ఆశలు.. ఆకాంక్షలకు వేదికగా నిలవాల్సిన శాసనసభ.. చివరకు కేవలం రాజకీయ పంతాలు, పట్టింపుల రణరంగంగా మారి ముగిసిపోయింది. రోజుకు కోట్లాది రూపాయల ప్రజాధనం నీళ్లపాలవుతున్నా.. **తరువాయి 2లో...**

### ఏటేటా తగ్గుతున్న కాలపరిమితి..

శాసనసభ సమావేశాల కాలపరిమితి ఏటా తగ్గిపోతుండటం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగిస్తున్న ప్రధాన అంశం. నియోజకవర్గాల వ్యాప్తంగా పేరుకుపోయిన మౌలిక సదుపాయాలు, తాగునీరు, రహదారుల సమస్యలపై ప్రజాప్రతినిధులు వేసే ప్రశ్నలకు దిశానిర్దేశం లభించాల్సి ఉండగా, కేవలం కొన్ని రోజుల వ్యవధికే సభను పరిమితం చేశారు. ఒక్క రోజు సభ నిర్వహణకు కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చవుతున్నప్పటికీ కేటాయించిన స్వల్ప సమయం కూడా వాయిదాలు, పోడియం ముట్టడులు, మైక్‌ల రచ్చతోనే తుడుచుపెట్టుకుపోయింది. సభలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాలైన బీఆర్‌ఎస్, బీజేపీ వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యలకు స్పష్టమైన పరిష్కారాలు చూపడం, హామీల అమలుపై రోడ్‌మ్యాప్ ఇవ్వడం కంటే గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికే అధికార కాంగ్రెస్ ఎక్కువ సమయం వెచ్చించింది. ప్రతిపక్షాల ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు చెప్పాల్సింది పోయి, ప్రతివిమర్శలతో సభలో వేడి పెంచడానికే ప్రాధాన్యమిచ్చింది. సస్పెన్షన్లు, మైక్‌ల కట్టింగ్‌లతో సభను ముందుకు నడిపించే ప్రయత్నం చేయడం విమర్శలకు తావిచ్చింది.


# వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

## 3,797 కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి

- తమ సమస్యల పరిష్కారం కోసం వీఆర్‌ఏలు హైకోర్టులో 11 రిట్స్ వేశారు
- కానీ, ప్రభుత్వం ఇప్పటిదాకా కౌంటర్ వేయలేదు
- బాధిత వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం సర్కార్ ప్రత్యేక చొరవ తీసుకోవాలి
- ఇమామ్‌లు, మౌజంలకు గౌరవ వేతనం ఆపేశారు
- మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు
- వారికి వెంటనే వేతనాలు చెల్లించాలి
- పాలిటెక్నిక్ విద్యార్థులతో ఆటలొద్దు
- జీవో 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి
- టీఆర్పీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- మండలిలో ప్రజా సమస్యలపై గళమెత్తిన మల్లన్న



**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:** రాష్ట్రంలో వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఆర్పీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండలిలో ప్రజా సమస్యలపై గళమెత్తారు. వీఆర్‌ఏల సమస్యలు, ఇమామ్‌ల గౌరవ వేతనాల ఆలస్యం, పాలిటెక్నిక్ విద్యార్థుల అవస్థల గురించి మాట్లాడారు. గతంలో వీఆర్‌ఏల విధులు గ్రామాల్లో వంతుల వారీగా ఉండేవని, కానీ, ఆ పరిస్థితి మారడంతో పలు సాంకేతిక సమస్యలు తలెత్తినట్లు గుర్తు చేశారు. అయితే వీఆర్‌ఏ పోస్టుల క్రమబద్ధీకరణ జరిగినప్పటికీ సదరు సాంకేతిక సమస్యల వల్ల ఇప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదన్నారు. 3,797 వీఆర్‌ఏ కుటుంబాలు సాంకేతిక సమస్యల కారణంగా ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. తమ సమస్యల పరిష్కారం కోసం వీఆర్‌ఏలు చాన్నాళ్లుగా పోరాటాలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. రాష్ట్ర హైకోర్టులో ఇప్పటి వరకు **తరువాయి 2లో...**




### హైదరాబాద్ వీఐపీలకు ఓట్ల గండం

- సినీ, క్రీడ, వ్యాపార ప్రముఖులకు నోటీసులు
- రాజమౌళి, మహేష్ బాబు, లక్ష్మణ్‌లకు ఓటరు సవరణ నోటీసులు
- ఓటరు జాబితాలో తప్పుల తడకలు
- గ్రేటర్ ఓటర్ల డ్రైవ్‌లో తీవ్ర లోపాలు
- టాలీవుడ్ స్టార్స్, గ్లోబల్ విజేతల పేర్లలో తేడాలు
- ఈసీ సవరణ లిస్టులో కదలిపోయిన వీఐపీ ప్రొఫైళ్లు
- ప్రొఫైళ్ల మ్యాచ్ కాక ఇబ్బందులు
- హియరింగ్‌కు ప్రతినిధులను పంపేందుకు గ్రీన్ సిగ్నల్

2



### ఇవాళ, రేపు బ్రిక్స్ సదస్సు

- రెండు రోజుల పాటు నిర్వహణ
- హస్తినలో భారీ బందోబస్తు
- నిన్న పుతిన్, మోదీ ప్రత్యేక భేటీ
- పలు కీలక అంశాలపై చర్చ
- గల్ఫ్ ఘర్షణలపై మంతనాలు

2

# పాత జ్ఞాపకాలు..!

- కొత్త భయాలు..!
- జోరుగా 80s ట్రెండ్..!
- వేదిక ఏఐనే..!
- ప్రస్తుత ఫొటోల అప్‌లోడ్..!
- 1980s ఇమేజ్‌ల క్రియేట్..!
- వారం రోజులుగా వాట్సాప్‌లో ఇదే ట్రెండ్..!
- రియల్ ఇమేజ్‌ల అప్‌లోడ్‌లపై సైబర్ నిపుణుల ఆందోళన..!
- ఫేస్ రికగ్నిషన్, వ్యక్తిగత సమాచారం
- చోరీ జరగొచ్చని హెచ్చరిక..!



**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:** పాత జ్ఞాపకాలను కొత్త టెక్నాలజీతో మళ్లీ కళ్లముందుకు తెచ్చుకునే సరికొత్త మోజు ఇప్పుడు 80s ట్రెండ్‌గా మారింది. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో వారం రోజులుగా ఇదే హడావుడి కనిపిస్తోంది. చేతిలో ఉన్న ప్రస్తుత ఫొటోను ఏఐ ఆధారిత ఇమేజ్ టూల్‌లో అప్‌లోడ్ చేస్తే చాలు.. క్షణాల్లోనే 1980ల నాటి ఫ్యాషన్, హెయిర్ స్టైల్, దుస్తులు, నేపథ్యం, ఫిల్మ్ కెమెరా ఎఫెక్ట్‌లతో పాతకాలపు ఫొటోలా మార్చేస్తోంది. కొందరు బాలీవుడ్ తరహా స్టూడియో పోర్ట్రెట్లుగా, మరికొందరు పాత కుటుంబ ఆల్బమ్ శైలిలో, **తరువాయి 2లో...**

### టోల్‌ప్లాజాల వద్ద ఆగాల్సిన పన్లేదు

- ఫిబ్రవరి నుంచి కొత్త డిజిటల్ విధానం
- ఫాస్టాగ్‌తో నంబర్ ప్లేట్ గుర్తింపు
- ఏటా రూ.10వేల కోట్ల అదనపు ఆదాయం
- ఇప్పటికే 90 శాతం తగ్గిన నిరీక్షణ



2

# 22ఏ పేరుతో లూటీ చేస్తున్నారు

## అసెంబ్లీలో ఈ విషయంపై చర్చ జరగకుండా కుట్ర చేశారు

- అందుకే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేశారు
- మా హయాంలో 16 లక్షలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండేవి
- ఆ సంఖ్య ఇప్పుడు కోటికి చేరింది
- రేవంత్‌రెడ్డి, పొంగులేటి తీరును ప్రజలు గమనిస్తున్నారు
- 22ఏ భూస్కాంపై సమగ్ర విచారణ అవసరం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2

రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల జాబితా పేరుతో భారీ భూదోపిడీ జరుగుతోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం 22ఏ భూ బాధితులతో కేటీఆర్ సమావేశమయ్యారు. అనంతరం హరీశ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో 16 లక్షల ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండేదన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ సంఖ్య కోటి ఎకరాలకు చేరిందన్నారు.

# డబుల్ బర్డెన్

- ఊబకాయానికి కేంద్రంగా హైదరాబాద్
- తెలంగాణలో వేగంగా పెరుగుతున్న సమస్య
- దేశవ్యాప్తంగా రెండు రకాల పోషక సమస్యలు
- భారత్‌లో 4.1 కోట్లకు పైగా పిల్లల్లో ఊబకాయం
- చిన్న వయసులోనే బీపీ, షుగర్ ముప్పు
- హైదరాబాద్ బడుల్లో 35 శాతం పిల్లలు అధిక బరువు



2

# 22ఏ పేరుతో లూటీ చేస్తున్నారు

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:** రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల జాబితా పేరుతో భారీ భూదోపిడీ జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం 22ఏ భూ బాధితులతో కేటీఆర్ సమావేశమయ్యారు. అనంతరం హరీశ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో 16 లక్షల ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండేదన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ సంఖ్య కోటి ఎకరాలకు చేరిందన్నారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ రేవంత్ సర్కార్‌ను చాన్నాళ్లుగా నిలదీస్తూ వస్తోందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ విమర్శల దాడికి భయపడే తమ పార్టీ శాసన సభ్యులను ప్రభుత్వం అసెంబ్లీ నుంచి సస్పెన్షన్ చేయించిందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఉంటే 22ఏ స్కాంకు సంబంధించి సర్కార్ అసలు రంగు బయటపడుతుందనే భయపడిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలే 22ఏ భూ స్కాంలో అసలు ముద్దాయిలని ఆరోపించారు. ప్రజల ఆస్తులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో భద్రత లేకుండా పోయిందన్నారు. అయితే, రేవంత్ సర్కార్ ఎన్ని జిమ్మిక్కులు, కుట్రలు చేసినా, ప్రజలకు బీఆర్ఎస్ తరపున అండగా ఉంటామన్నారు. 22ఏ పేరుతో జరుగుతున్న భూదోపిడీపై సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరముందన్నారు. ప్రజల ఆశీస్సులతో తమ ప్రభుత్వం మళ్లీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని, పవర్‌లోకి వచ్చిన తర్వాత 22ఏ భూస్కాం, కాంగ్రెస్ సర్కార్ నిర్ణయాలపై పునఃసమీక్ష చేస్తామని స్పష్టం చేశారు.

# పాత జ్ఞాపకాలు..!

**మొదటిపేజీ తరువాయి...**

ఇంకొందరు తమ చిన్ననాటి లేదా యువత కాలం ఎలా ఉండేదో ఊహించుకునేలా చిత్రాలను రూపొందించుకుంటున్నారు. సాధారణ వినియోగదారుల నుంచి ప్రముఖుల వరకు ఈ ట్రెండ్‌లో భాగమవుతుండటంతో 80ల నాటి దృశ్యాలపై మరోసారి నోస్టాల్జియా (పాత జ్ఞాపకాలను తలచుకోవడం) పెరిగింది. ఏఐ టెక్నాలజీ కొన్ని క్షణాల్లోనే ఆధునిక ఫొటోను పూర్తిగా భిన్నమైన కాలానికి చెందినదిగా మలచగలగడం ఈ ట్రెండ్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.

సరదాగా మొదలైన ఈ ట్రెండ్ ఇప్పుడు సైబర్ భద్రతపై కొత్త ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఫొటోను ఏఐ వేదికకు అప్‌లోడ్ చేసినప్పుడు అది కేవలం ఓ ఇమేజ్ మాత్రమే కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖం, కళ్ల ఆకృతి, చర్మ లక్షణాలు, వయస్సు, శరీర ఆకృతి వంటి బయోమెట్రిక్ లక్షణాలు కూడా ఆ చిత్రంలో భాగంగానే ఉంటాయి. వినియోగదారులు అప్‌లోడ్ చేసిన చిత్రాలను ఏఐ సేవలు ఎలా నిల్వ చేస్తాయి.. ఎంతకాలం ఉంచుతాయి.. వాటిని ఏ ప్రయోజనాలకు వినియోగిస్తాయి.. మూడోపక్షాలకు చేరుతాయా అన్నది తెలుసుకోవడం కీలకమవుతోంది. కొన్ని సేవలు వినియోగదారుల అప్‌లోడ్‌లను తమ వ్యవస్థల మెరుగుదలకు ఉపయోగించే అవకాశం ఉండటంతో, వ్యక్తిగత ఫొటోల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఏఐ వేదికల గోప్యతా విధానాలు పూర్తిగా చదవకుండా ఫొటోలను అప్‌లోడ్ చేయడం వల్ల భవిష్యత్‌లో అనుకోని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు స్పష్టమైన ముఖ చిత్రాలు పెద్ద ఎత్తున ఆన్‌లైన్‌లోకి వెళ్లడం వల్ల ఫేస్ రికగ్నిషన్, గుర్తింపు దుర్వినియోగం, డీప్‌ఫేక్‌లు, నకిలీ ఖాతాలు వంటి ముప్పులు పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనలు ఉన్నాయి. ఒకసారి ఏదైనా డిజిటల్ వేదికకు అప్‌లోడ్ చేసిన సమాచారాన్ని పూర్తిగా వెనక్కి తీసుకోవడం ఎప్పుడూ సులభం కాదు. అందుకే ఏఐ ఫొటో ట్రెండ్‌ను పూర్తిగా దూరం పెట్టాల్సిన అవసరం లేకపోయినా.. వ్యక్తిగత ఫొటోలు, పిల్లల చిత్రాలు, గుర్తింపు పత్రాలు, ఇంటి వివరాలు, ఇతర సున్నితమైన సమాచారం కనిపించే ఫొటోలను అప్‌లోడ్ చేసే ముందు జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉంది. ఎనిమిది దశాబ్దాల వెనక్కి తీసుకెళ్లే ఏఐ ఫొటో సరదా కావొచ్చు.. కానీ, ఆ సరదా కోసం నేటి డిజిటల్ గుర్తింపును పణంగా పెట్టకూడదన్నదే సైబర్ నిపుణుల అభిప్రాయం. అందువల్ల 80s ఫొటోల మోజు సంగతి దేవుడెరుగు.. ముందు వ్యక్తిగత భద్రతా అంశాలపై తగిన జాగ్రత్తలు తీసుకోవడం బెటర్ అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# అసెంబ్లీ సాధించిందేంది..?

**మొదటిపేజీ తరువాయి...**

ప్రజాప్రతినిధులు మాత్రం ప్రజల సమస్యలను పక్కనబెట్టి పరస్పర దూషణలు, పొలిటికల్ మైండ్ గేమ్‌లకే ప్రాధాన్యమిచ్చారు. రైతుల కష్టాలు, నిరుద్యోగుల భవిష్యత్తు, సంక్షేమ పథకాల అమలుపై సుదీర్ఘ చర్చలు సాగుతాయని ఆశించిన సామాన్యుడికి చివరకు మిగిలింది తీవ్ర నిరాశే. అధికార కాంగ్రెస్ ప్రత్యారోపణలు, ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీల నిరసనలు, వాకౌట్ల నడుమ సభ ముగియడంతో.. వర్తమాన అసెంబ్లీ సమావేశాల వల్ల తెలంగాణ ప్రజలకు ఒరిగింది శూన్యమనే చేదు నిజం మరోసారి స్పష్టమైంది.

**ప్రతిపక్ష పాత్రలో బీఆర్ఎస్ విఫలం..**

మరోవైపు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్, ప్రభుత్వంపై నిర్మాణాత్మకమైన ఒత్తిడి తీసుకురావడంలో పూర్తిగా విఫలమైంది. రుణమాఫీ, రైతాంగ సమస్యలు, హామీల అమలుపై సుదీర్ఘ చర్చలు జరిపి ప్రభుత్వాన్ని కటికబోనులో నిలబెట్టే అవకాశం ఉన్నప్పటికీ, నిరసనలు, వాకౌట్లకే పరిమితమైంది. సభను స్తంభింపజేయడమే నైజంగా వ్యవహరించి, ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక బీజేపీ సైతం తన సొంత రాజకీయ ఉనికి కోసం మాత్రమే తాపత్రయపడింది. ఫీజు రీయింబర్స్మెంట్ వంటి కీలక అంశాలపై సభ లోపల ప్రజాస్వామ్యయుతంగా పోరాడాల్సింది పోయి, కేవలం రాజకీయాంశాలపై సభ బయట నిరసనలు తెలపడానికే ప్రాధాన్యం ఇచ్చింది. రాష్ట్రంలో కోట్లాది మంది జీవితాలతో ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన అంశాలు ఈ సమావేశాల్లో చర్చకు నోచుకోలేదు. రుణమాఫీ పూర్తిస్థాయి అమలు, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతాంగానికి స్పష్టమైన భరోసా లభించలేదు. ఉద్యోగ నియామకాల క్యాలెండర్, గ్రూప్ పరీక్షల నిర్వహణ, ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై నోటిఫికేషన్ల లెక్కింపు కోసం ఎదురుచూసిన నిరుద్యోగ యువతకు మళ్లీ ఆశాభంగమే ఎదురైంది. పెరుగుతున్న అప్పులు, కొత్త రేషన్ కార్డులు, పింఛన్ల పంపిణీ జాప్యం వంటి సామాన్యుడి దైనందిన సమస్యల కంటే పార్టీల మైండ్ గేమ్‌లే ప్రధాన ఎజెండాను శాసించాయి. సమావేశాలు పూర్తయిన తర్వాత తమ సమస్యపై సభలో ఫలానా సానుకూల నిర్ణయం జరిగిందని చెప్పుకోవడానికి ఏ ఒక్క వర్గానికీ ఏమీ లభించలేదు. ప్రజాధనాన్ని నీళ్లపాలు చేస్తూ, తమ గొంతుకగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులు సభను రాజకీయ వేదికగా మార్చుకోవడం పట్ల తెలంగాణ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు తమ ధోరణి మార్చుకోకపోతే, శాసనసభ వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకం పూర్తిగా సడలిపోయే ప్రమాదం ముంచుకొస్తోంది.





# పది రోజుల ఉత్కంఠకు తెర

- ఇంటి దొంగల స్కెచ్
- రిటైర్డ్ ఆర్మీ అధికారి ఇంట్లోనే ఆయుధాలు
- 3నెలల్లో దశలవారీగా తరలింపు
- మాయమైన ఆయుధాలు స్వాధీనం
- వీడిన బొల్లారం ఆర్మీ ఆయుధాల కేసు

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:** సికింద్రాబాద్ బొల్లారంలోని 20 మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ ఆర్మరీలో భారీగా ఆయుధాలు, బుల్లెట్లు మాయమైన హై-ప్రొఫైల్ కేసును తెలంగాణ పోలీసులు, మిలటరీ ఇంటెలిజెన్స్, ఎన్ఐఏ సంయుక్తంగా ఛేదించాయి. గత పది రోజులుగా దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన ఈ ఘటనకు సంబంధించిన దర్యాప్తు వివరాలను తెలంగాణ డీజీపీ ప్రెస్ మీట్‌లో వెల్లడించారు. చోరీకి గురైన ఆయుధాలను రికవరీ చేయడంతో పాటు ఈ దందా వెనుక ఉన్న లోపలి వ్యక్తుల కుట్రను ఆధారాలతో సహా బయటపెట్టినట్లు తెలిపారు. ఇది బయటి వ్యక్తులు ఒక్క రోజులో చేసిన చోరీ కాదని, ఆర్మీ క్యాంప్‌కు చెందిన అంతర్గత సిబ్బంది గత మూడు నెలలుగా దశలవారీగా సాగించిన తీవ్ర కుట్ర అని డీజీపీ స్పష్టం చేశారు. ఆర్మరీ వద్ద భద్రతా లోపాలను ఆసరాగా చేసుకుని, రాత్రి వేళల్లో సీసీటీవీ కెమెరాలను నిలిపివేస్తూ ఆయుధాలను బయటకు తరలించినట్లు దర్యాప్తులో తేలింది. సాంకేతిక, ఫోరెన్సిక్ ఆధారాల సహాయంతో విచారణ వేగవంతం చేసి, మాజీ ఆర్మీ ఉద్యోగితో పాటు ఇందులో భాగస్వాములైన మరికొందరిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మహబూబ్‌నగర్ పరిధిలోని ఒక మాజీ ఆర్మీ ఉద్యోగి నివాసంతో పాటు పరిసర ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు నిర్వహించిన సోదాల్లో మాయమైన ఆయుధాలు, మందుగుండు సామగ్రి లభ్యమయ్యాయి. ఈ ఆయుధాల సేకరణ వెనుక ఏవైనా అక్రమ ముఠాలు లేదా తీవ్రవాద నెట్‌వర్క్‌ల ప్రమేయం ఉందా అనే కోణంలో లోతుగా విచారిస్తున్నట్లు తెలిపారు. వర్షం పడిన రాత్రి తాళాలు పగలగొట్టి బయటి దొంగలు దోచుకెళ్లినట్లు సృష్టించిన నాటకాన్ని సైంటిఫిక్ విచారణతో తిప్పికొట్టినట్లు డీజీపీ తెలిపారు. ఆర్మరీ పరిసరాల్లో రాత్రి వేళ సీసీ కెమెరాలు నిలిచిపోవడం, సెక్యూరిటీ అలారాలు పనిచేయకపోవడం వెనుక స్థానిక అధికారుల ప్రమేయం స్పష్టంగా ఉందన్నారు.

# టోల్‌ప్లాజాల వద్ద ఆగాల్సిన పన్లేదు

**శనార్తి తెలంగాణ, న్యూఢిల్లీ:** జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు మరింత ఊరట కలిగించేలా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆగాల్సిన అవసరం లేకుండా నేరుగా వెళ్లేలా పూర్తిగా డిజిటల్ తరహా రహిత టోల్ వసూలు వ్యవస్థను అందుబాటులోకి తేనున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. వచ్చే ఫిబ్రవరి నాటికి ఈ నూతన సాంకేతికతను అమలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ముంబైలో నిర్వహించిన 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026' వేదికగా మంత్రి గడ్కరీ ఈ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఫాస్టాగ్ సిస్టమ్‌ను 'ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రెకగ్నిషన్' కెమెరాల సాంకేతికతతో జోడిస్తారు. వాహనం టోల్ జోన్ దాటుతున్న సమయంలోనే నంబర్ ప్లేట్, ఫాస్టాగ్ వివరాలను స్కాన్ చేసి, సంబంధిత వాలెట్ లేదా బ్యాంక్ ఖాతా నుండి టోల్ రుసుము ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది. నూతన సాంకేతికత ద్వారా టోల్ లీకేజీలు అరికట్టబడి, ప్రభుత్వానికి ప్రతి ఏటా సుమారు రూ. 10వేల కోట్ల అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ప్లాజాల వద్ద నిరీక్షణ సమయం సున్నాకు చేరడంతో ఇంధనంతో పాటు విలువైన ప్రయాణ సమయం ఆదా అవుతుందన్నారు. 2016లో ప్రవేశపెట్టి, 2021 నాటికి దేశవ్యాప్తంగా తప్పనిసరి చేసిన ఫాస్టాగ్ వల్ల టోల్ ప్లాజాల వద్ద వాహనాలు వేచి ఉండే సమయం ఇప్పటికే 80% నుండి 90% వరకు తగ్గిందని ఆయన గుర్తుచేశారు. గతంలో ఒక్కో వాహనం టోల్ దాటేందుకు 12 నుండి 30 నిమిషాలు పట్టేదని, రాబోయే కొత్త సిస్టమ్‌తో అసలు వాహనం వేగం తగ్గించాల్సిన అవసరమే ఉండదని స్పష్టం చేశారు.

# డబుల్ బర్డెన్



**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:** ఒకప్పుడు చిన్నారులలో ఎదుగుదల లోపం, తక్కువ బరువు ప్రధాన సమస్యలుగా ఉండేవి. కానీ ఇప్పుడు మారుతున్న జీవనశైలితో పరిస్థితి వేగంగా మారుతోంది. తెలంగాణ వ్యాప్తంగా చిన్నారులలో అధిక బరువు, ఊబకాయం సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే లెక్కల ప్రకారం.. గతంలో 0.7 శాతంగా ఉన్న చిన్నారుల ఊబకాయం బాధితుల సంఖ్య, ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 నాటికి ఏకంగా 3.4 శాతానికి చేరుకుంది. దీంతో దేశంలోనే చిన్నారుల ఊబకాయం ఎక్కువగా నమోదవుతున్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ఎనిమిదో స్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. రాజధాని హైదరాబాద్ వంటి నగరాల్లో పరిస్థితులు మరీ ఆందోళనకరంగా మారాయి. ఇక్కడి పాఠశాలలకు వెళ్లే పిల్లలలో దాదాపు 20 నుంచి 35 శాతం మంది అధిక బరువు లేదా ఊబకాయంతో బాధపడుతున్నారని పలు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కేవలం సంపన్న వర్గాల ప్రైవేట్ పాఠశాలల్లోనే కాకుండా, ప్రభుత్వ, సెమీ-అర్బన్ పాఠశాలల్లోనూ 19 నుంచి 21 శాతం మంది పిల్లలు ఈ సమస్యతో ఇబ్బందిపడుతుండటం విశేషం. దేశవ్యాప్తంగా దాదాపు 4.1 కోట్లకు పైగా పిల్లలు ఊబకాయంతో ఉన్నట్లు అంచనా. ఒకవైపు పౌష్టికాహార లోపంతో పిల్లలు బాధపడుతుంటే, మరోవైపు అధిక బరువుతో సతమతమవుతుండటాన్ని వైద్య రంగాలు 'డబుల్ బర్డెన్' గా పరిగణిస్తున్నాయి. ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ నివేదిక ప్రకారం తెలంగాణలో 47.7 శాతం మంది పెద్దలు కూడా అధిక బరువు కలిగి ఉన్నారు. ఇళ్లలో సంప్రదాయ పోషకాహారానికి స్వస్తి చెప్పి జంక్ ఫుడ్, నూడుల్స్, చిప్స్, అధిక ఉప్పు-చక్కెరలు ఉండే ప్యాకేజ్డ్ పానీయాలు తీసుకోవడం వల్ల పిల్లలలో కేలరీలు మితిమీరిపోతున్నాయి. గతంలో మధ్యవయస్కులలో మాత్రమే కనిపించే టైప్-2 మధుమేహం, ఫ్యాటీ లివర్, అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులు ఇప్పుడు బడి ఈడు పిల్లలలోనూ బయటపడుతుండటం తీవ్ర పరిణామాలకు దారితీస్తోంది.

# హైదరాబాద్ వీఐపీలకు ఓట్ల గండం

**శనార్తి తెలంగాణ, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. ముసాయిదా ఓటరు జాబితాల ప్రచురణ అనంతరం డేటా పరిశీలనలో భారీ స్థాయిలో లోపాలు వెలుగుచూశాయి. పేర్లలో అక్షర దోషాలు, తండ్రి లేదా భర్త పేర్లలో తేడాలు, గత రికార్డులతో ప్రొఫైళ్లు సరిపోలకపోవడం వంటి సాంకేతిక సమస్యల కారణంగా నగరంలోని పలువురు సినీ, క్రీడా, వ్యాపార రంగాల ప్రముఖులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఓటరు ఐడీ వివరాల్లో వ్యత్యాసాల కారణంగా నోటీసులు పొందిన వారిలో ప్రముఖుల జాబితా పెద్దగానే ఉంది. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, హీరో మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్, విక్టరీ వెంకటేష్, ఆయన కుమార్తెలు, నటి సమంత, విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, క్రీడారంగం నుంచి క్రికెట్ దిగ్గజాలు వి.వి.ఎస్. లక్ష్మణ్, మిథాలీ రాజ్, బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, స్టార్ ప్లేయర్ సైనా నెహ్వాల్, పారిశ్రామిక వర్గాల నుంచి దివీస్ లాబొరేటరీస్ అధినేత మురళీ కృష్ణ ప్రసాద్ దివి, మెగా కోడలు ఉపాసన కొణిదెల తదితరులు ఉన్నారు. గుర్తింపు కార్డుల్లో దొర్లిన తప్పులను సరిదిద్దుకునేందుకు తగిన ఆధారాలు సమర్పించాలని అధికారుల సూచించారు. సవరణ ప్రక్రియ విచారణకు వీఐపీలు స్వయంగా హాజరు కాలేని పక్షంలో, అధికారిక పత్రాలతో తమ ప్రతినిధులను పంపవచ్చని స్పష్టం చేశారు. నగరంలో సాధారణ పౌరులతో పాటు సమాజంలో అగ్రస్థానంలో ఉన్న ప్రముఖుల కార్డుల్లోనూ ఈ స్థాయిలో లోపాలు దొర్లడంపై ఎన్నికల యంత్రాంగం తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రక్రియను మరింత సరళతరం చేసి తత్వరగా వివరాలు నవీకరించాలని ప్రజలు కోరుతున్నారు.



# వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

**మొదటిపేజీ తరువాయి...**

479 మంది బాధిత వీఆర్ఏలు హైకోర్టులో 11 రిట్ పిటిషన్లు కూడా దాఖలు చేశారన్నారు. వారు రిట్ పిటిషన్లు వేసి ఏడాది గడుస్తున్నా.. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదని ప్రశ్నించారు. సర్కార్ తీరుతో వీఆర్ఏలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, అందువల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఇక ఇమామ్, మౌజంల సాదకబాధకాల గురించి మల్లన్న మండలిలో ప్రస్తావించారు. ఇమామ్, మౌజంలకు మూడు నెలలుగా గౌరవ వేతనాలు రావడం లేదన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల గౌరవ వేతనాలతో పాటు ప్రతీ నెల క్రమం తప్పకుండా వేతనాలు ఇవ్వాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థుల పరిస్థితి గురించి ప్రస్తావించిన మల్లన్న, వారి సిట్యుయేషన్‌పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97 వారి పాలిట శాపంగా మారిందన్నారు. సర్కార్ పాలిటెక్నిక్ విద్యార్థులతో ఆటలు ఆడవద్దని, వెంటనే సదరు జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వు వల్ల భవిష్యత్తులో స్కాలర్‌షిప్‌లు, ఫీజులు, విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వెల్లడించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి పాలిటెక్నిక్ వ్యవస్థను తీసుకురావడంపై విద్యార్థులు పెద్ద సంఖ్యలో తనకు వినతి పత్రాలు అందజేసినట్లు వివరించారు. స్కిల్ యూనివర్సిటీ పనితీరు అస్సలు బాగోలేదన్నారు. అందువల్ల జీవో 97ను వెంటనే రద్దు చేసి, పాత విధానంలోనే పాలిటెక్నిక్ విద్యను కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# ఇవాళ, రేపు బ్రిక్స్ సదస్సు

**శనార్తి తెలంగాణ, న్యూఢిల్లీ:** ప్రపంచ భౌగోళిక, ఆర్థిక పరిణామాల నేపథ్యంలో 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు న్యూఢిల్లీ సిద్ధమైంది. ఇవాళ, రేపు భారత్ మండపంలో రెండు రోజుల పాటు సదస్సు జరగనుంది. ఆహార, ఇంధన భద్రత, ఆరోగ్యం, విపత్తుల నిర్వహణ, కీలక సరఫరా వ్యవస్థలు, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం, అంతర్జాతీయ పాలన వంటి అంశాలు సదస్సులో చర్చకు రానున్నాయి. పశ్చిమాసియా, బ్లాక్‌సీ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఘర్షణల ప్రభావం కూడా కీలక చర్చాంశంగా మారనుంది. సముద్ర మార్గాల భద్రత, నౌకాయానం, ఇంధన సరఫరాలపై నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో బ్రిక్స్ దేశాల మధ్య సమన్వయం పెంచడంపై దృష్టి సారించనున్నారు. బ్రిక్స్ దేశాలు కలిపి ప్రపంచ జనాభాలో సగానికి, ప్రపంచ జీడీపీలో దాదాపు 40 శాతానికి, ప్రపంచ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను ప్రాతినిధ్యం వహిస్తున్నందున భారత్ అధ్యక్షతన జరిగే ఈ సదస్సు నిర్ణయాలకు అంతర్జాతీయంగా ప్రాధాన్యం ఏర్పడింది. ఆర్థిక సహకారాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను అంతర్జాతీయ వేదికలపై బలంగా వినిపించడంపైనా నేతలు దృష్టి సారించనున్నారు.

ఇక సదస్సుకు ముందు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఢిల్లీలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇంధనం, రక్షణ, ద్వైపాక్షిక సంబంధాలతో పాటు పశ్చిమాసియా, బ్లాక్‌సీ ప్రాంతాల్లోని ఘర్షణలపై ఇరువురు చర్చించారు. ఈ పరిణామాలు సముద్ర వాణిజ్యాన్ని, భారతీయ నావికుల భద్రతను ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో ఘర్షణలకు చర్చలు, దౌత్యమే పరిష్కారమని మోదీ స్పష్టం చేశారు. మరోవైపు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పజెష్కియాన్ సహా పలువురు నేతలతో మోదీ ద్వైపాక్షిక భేటీలు నిర్వహించనున్నారు. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. వేలాది మంది పోలీసులతో పాటు భారీగా పారా ట్రూప్స్‌ను మోహరించారు. వీవీఐపీ రాకపోకల నేపథ్యంలో కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, పలు డైవర్షన్స్‌ను అమలు చేయనున్నారు. సీసీటీవీ కెమెరాలు, యాంటీ డ్రోన్ వ్యవస్థలు, స్నిఫర్ డాగ్‌లతో నిఘా పెంచారు.



# మల్లన్న పాదయాత్రను విజయవంతం చేద్దాం

**యాత్రకు లక్షలాదిగా సంఘీభావం తెలుపుదాం**

**టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్**

**పాదయాత్రకు మద్దతుగా సంగారెడ్డి నుంచి ఝురాసంగం వరకు భారీ బైక్ ర్యాలీ**

**శనార్తి తెలంగాణ, సంగారెడ్డి:** ఈ నెల 17వ తేదీన గోల్కొండ నుంచి టీఆర్పీ చీఫ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపట్టనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. మల్లన్న పాదయాత్రకు మద్దతుగా శుక్రవారం సంగారెడ్డి చౌరస్తా నుంచి ఝురాసంగం దేవస్థానం వరకు టీఆర్పీ శ్రేణులు, స్థానిక ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్న చేపట్టబోయే ఈ పాదయాత్ర ఒక సాధారణ రాజకీయ కార్యక్రమం కాదని, ప్రతి గడపకూ వెళ్లి ప్రజల కష్టసుఖాలను తెలుసుకునే ఒక పవిత్ర ప్రజా ఉద్యమమని తెలిపారు. గత 70 సంవత్సరాలుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీవ్ర అణచివేతకు గురయ్యారని, అందువల్ల ఆ వర్గాలను చైతన్యం చేసేందుకే మల్లన్న ఈ మహాపాదయాత్రకు పూనుకున్నట్లు వెల్లడించారు. సబ్బండ బీసీ కులాలకు రాజ్యాధికారం దక్కాలంటే సమాజంలో మెజార్టీ ప్రజలు సంఘటితం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం సుధాకర్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు నవాజ్, ఉమ్మడి మెదక్ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ హర్ష, హైదరాబాద్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ శ్రీకాంత్, సంగారెడ్డి సోషల్ మీడియా ఇన్‌చార్జ్ వీరేశం, న్యాల్‌కల్ మండల అధ్యక్షులు బి.వీరేందర్, రాయికోడ్ మండల అధ్యక్షులు అంజయ్య, మునిపల్లి మండల అధ్యక్షులు నరేష్, మొగుడంపల్లి అధ్యక్షులు శ్రీనివాస్, ఎండి లతీఫ్ తాబిదే, తదితరులు పాల్గొన్నారు.